నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, శనివారం 19 ఏప్రిల్ 2025 | KARIMNAGAR

## బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ యూత్ నాయకుడు

### గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ (జమ్మికుంట), ఏప్రిల్ 18 : కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని 22వ వార్డులో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కనకం రత్నాకర్ శుక్రవారం బీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు మంద రాజేశ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి గులాబీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు నచ్చకనే బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు రత్నాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, పట్టణాధ్యక్షుడు టంగుటూరు రాజ్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ పొనగంటి సంపత్, వార్డు నాయకులు ఎర్ర సతీశ్, ఎండీ సల్మాన్, ఎర్ర వంశీ, వీ శశి, అంబాల అరుణ్, కనకం హరీశ్, వంతడుపుల రెమో, చింటూ, తదితరులు పాల్గొన్నారు.


రత్నాకర్‌కు గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

# కేంద్రాల్లో ధాన్యం • రైతన్న దైన్యం

ధాన్యం కొనుగోళ్లలో మళ్లీ అలసత్వమే కనిపిస్తున్నది. ఓవైపు కోతలు ముమ్మరం అవుతున్నా.. కొనడంలో మాత్రం జాప్యమే జరుగుతున్నది. ఎమ్మెల్యేలు, మంత్రుల, ఇతర ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా కేంద్రాలను ప్రారంభిస్తున్నా.. కొనుగోళ్లు మాత్రం చేయడం లేదు. కరీంనగర్ జిల్లాలో 328 కేంద్రాలు ఏర్పాటు చేసినా.. ఇప్పటి వరకు కేవలం ఏడు కేంద్రాల ద్వారా 148 మెట్రిక్ టన్నులే కొనడం పరిస్థితికి అద్దం పడుతున్నది. అనేక కేంద్రాల్లో టార్పాలిన్లు సమకూర్చడం లేదని, అకాల వర్షం వస్తే తమ పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రారంభించిన ప్రతి కేంద్రంలో తక్షణమే కొనుగోళ్లు ప్రారంభించాలని, సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.


కరీంనగర్ మార్కెట్ యార్డులో ధాన్యం కుప్ప చేస్తున్న మహిళా రైతు

## ముమ్మరమైన కోతలు.. జాడలేని కొనుగోళ్లు

- కుప్పలు తెప్పలుగా వడ్ల రాశులు
- కొనుగోళ్ల కోసం రైతుల ఎదురుచూపులు
- మొక్కుబడిగా కేంద్రాల ప్రారంభం!
- కరీంనగర్ జిల్లాలో ఏడు కేంద్రాల్లోనే కొనుగోళ్లు
- ఇప్పటి వరకు కొన్నది కేవలం 148 మెట్రిక్ టన్నులే
- వారం పది రోజులుగా అన్నదాతల పడిగాపులు


కరీంనగర్ మార్కెట్ యార్డులో ధాన్యం పోస్తున్న ట్రాక్టర్

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పది రోజులుగా కోతలు ముమ్మరమయ్యాయి. ముందు వరి సాగు చేసిన కొన్ని ప్రాంతాల్లో దాదాపు 20 రోజుల నుంచే నడుస్తున్నాయి. ఇప్పుడు ఎక్కడ చూసినా రోడ్లు, మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలే దర్శనమిస్తున్నాయి. కోతల వెంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసుంటే రెండు మూడు రోజులు ఆరబెట్టుకుని తేమ శాతం వచ్చిన తర్వాత రైతులు విక్రయించుకునే అవకాశముండేది. కానీ, ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయింది. ముందుగా కోతలు నిర్వహించుకున్న రైతులు ఇప్పటికీ ధాన్యం అమ్ముకోలేని పరిస్థితి ఉన్నది.

కరీంనగర్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి జిల్లాలోని కొన్ని మండలాల్లో 60 నుంచి 70 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. ఇంకొన్ని మండలాల్లో 80 నుంచి 90 శాతానికి చేరుకున్నాయి. చివరలో వేసిన ప్రాంతాల్లో చూస్తే 20 నుంచి 30 శాతం కోతలు కంప్లీట్ అయ్యాయి. అంటే ప్రతి మండలంలో ముమ్మరమయ్యాయి. అయితే కరీంనగర్ జిల్లాలో ఏర్పాటు చేసిన 328 కొనుగోలు కేంద్రాలను ఈ నెల 10వ తేదీనే ప్రారంభిస్తున్నట్టు అధికారులు తెలిపారు. కానీ, ఇప్పటికీ ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఒక్కొక్కటి ప్రాంభిస్తున్నారు. కేంద్రాలు మొక్కుబడిగా ప్రారంభిస్తున్నా.. కొనుగోళ్లు మాత్రం జరపడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని కేవలం 148 మెట్రిక్ టన్నుల ధాన్యం నిన్న ఒక్క రోజే కొనుగోలు చేసినట్లు తెలుస్తున్నది. నిజానికి కోతల వెంటే కొనుగోళ్లు ప్రారంభించినట్లయితే ఇప్పటికే అనేక మంది రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకునే పరిస్థితి ఉండేది.

### ప్రారంభమే.. కొనేది లేదు!

కరీంనగర్ జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 185, ఐకేపీ ద్వారా 101, డీసీఎమ్మెస్ ద్వారా 38, హాకా ద్వారా 4 చొప్పున మొత్తం 328 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 148 టన్నుల ధాన్యం మాత్రమే కొన్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడి ధాన్యం అక్కడే కనిపిస్తున్నది. రాత్రి, పగలు తేడా లేకుండా రైతులు పడిగాపులు పడాల్సి వస్తున్నది. అకాల వర్షం భయపెడుతున్నది. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో టార్పాలిన్ల కొరత తీవ్రంగా ఉన్నది. వర్షం వస్తే తమ పరిస్థితి ఏంటని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- కరీంనగర్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కేంద్రంలో వల్లంపహాడ్, రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, కిసాన్‌నగర్‌కు చెందిన రైతులు మూడు నాలుగు రోజులుగా ధాన్యం తెచ్చి కుప్పలుగా పోస్తున్నా. ఇప్పటికే 10 మందికిపైగా ధాన్యం తెచ్చారు. రాత్రీ పగలు పడిగాపులు కాస్తున్నారు. టార్పాలిన్ల కొరత ఉన్నది. అధికారులు మాత్రం ఇప్పటి వరకు కేంద్రాన్ని ప్రారంభించలేదు. కొత్తపల్లి మండలంలోని కొత్తపల్లి, బద్దిపల్లి, మల్కాపూర్, ఆసిఫ్‌నగర్, చింతకుంట గ్రామాల్లో కోతలు ముమ్మరమయ్యాయి. కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేశారు. శుక్రవారం మల్కాపూర్‌లో 500 క్వింటాళ్లు తీసుకోవడం మినహాయిస్తే ఎక్కడా కొనుగోళ్లు జరగడం లేదు. కరీంనగర్ రూరల్ మండలంలోని మిగతా గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కూడా కేంద్రాలను ప్రారంభించారు. అదే విధంగా కొనుగోళ్లు కూడా ముమ్మరం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.
- మానకొండూర్ మార్కెట్ యార్డులో శుక్రవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఇప్పటికే రైతులు ఇక్కడ ధాన్యం కుప్పలు పోసుకుని ఉన్నారు. కేంద్రం ప్రారంభించిన అధికారులు ఒక్క క్వింటాల్ ధాన్యం కూడా కొనలేదు. తేమ శాతం అధికంగా ఉందని, ఆరబెట్టిన తర్వాత కొంటామని చెప్పడంతో రైతులు నిరాశకు గురయ్యారు. ఇదే మండలంలోని మరిన్ని గ్రామాల్లో ఎమ్మెల్యే కేంద్రాలను ప్రారంభించారు. కానీ ఒక్క చోట కూడా కొనుగోళ్లు చేయలేదు. పలు గ్రామాల్లో పంట కోతలు చేసిన రైతులు కొనుగోళ్లు ఎప్పుడు జరుగుతాయోనని ఎదురు చూస్తున్నారు. శంకరపట్నంలో వారం పదిరోజులుగా కోతలు ముమ్మరంగా జరుగుతుండగా, రైతులు రోడ్లపై, కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పోసుకుని విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారు. శుక్రవారం పలు గ్రామాల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి కేంద్రాలను ప్రారంభించారు.
- హుజూరాబాద్ మండలంలో ఎక్కువగా ఈ సీజన్‌లో సీడ్ వడ్లు సాగు చేస్తారు. ఈ మండలంతోపాటు వీణవంక, జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల్లో సీడ్ వడ్లు కోతలు దాదాపుగా ముగిశాయి. సాధారణ కోతలు ముమ్మరంగా నడుస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో కొనుగోళ్లు చేస్తున్నారు. వీణవంకలో 70 నుంచి 80 శాతం కోతలు పూర్తయ్యాయి. వీణవంక, చల్లూరు, మామిడాలపల్లి, కనపర్తి గ్రామాల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. కానీ, కొనుగోళ్లు మాత్రం ప్రారంభించ లేదు. ఈ మండలంలోనూ టార్పాలిన్ల కొరత తీవ్రంగా కనిపిస్తున్నది. అకాల వర్షం పడితే తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో నిన్నటి నుంచే కేంద్రం ప్రారంభించగా ఇప్పటి వరకు కొనుగోళ్లు మాత్రం చేపట్టలేదు.
- చిగురుమామిడి మండలంలోని కొన్ని గ్రామాల్లో మాత్రమే కొనుగోళ్లు ప్రారంభించారు. సైదాపూర్ మండలంలో జాగిరిపల్లె మినహాయిస్తే మిగతా గ్రామాల్లో స్వల్పంగా కొనుగోళ్లు చేశారు. వెన్నంపల్లిలో ఇంకా కొనుగోలు కేంద్రాన్నే ప్రారంభించ లేదు.
- చొప్పదండి మండలంలో కోతలు ముమ్మరంగా నడుస్తున్నాయి. కానీ, కొనుగోళ్లు మాత్రం ప్రారంభించలేదు. చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌తోపాటు రుక్మాపూర్, కొలిమికుంట, భూపాలపట్నంలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కొనుగోళ్లను ప్రారంభించారు. కానీ, కొనుగోళ్లు మాత్రం జరగ లేదు. గంగాధర మండలంలో 70 శాతానికిపైగా కోతలు జరిగాయి. సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఇప్పటికే పలు గ్రామాల రైతులు పచ్చి ధాన్యాన్నే తక్కువ ధరకు దళారులకు విక్రయించుకున్నారు. పది పదిహేను రోజులుగా ధాన్యం ఆరబోస్తూ రైతులు పడిగాపులు పడుతున్నారు. కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. రామడుగు మండలంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. దత్తోజీపేటలో కేంద్రం ప్రారంభించినా కొనుగోళ్లు మొదలు కాలేదు.

### ముమ్మరం చేయకుంటే ముప్పే

కోతలు ప్రారంభమై 15 నుంచి 20 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కొనుగోళ్లు ముమ్మరం చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కల్లాల వద్ద ఆరబెట్టుకునే సదుపాయం లేక కేంద్రాల్లో, మార్కెట్ యార్డులను ఆశ్రయిస్తున్నారు. కొందరు రైతులు పది పదిహేను రోజులుగా ధాన్యం ఆరబెట్టుకోవడం, కుప్పలు చేయడం వంటి పనులకే పరిమితం అవుతున్నారు. చాలా చోట్ల టార్పాలిన్లకు కొరత కనిపిస్తుండగా, వర్షాలు వస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కొన్ని చోట్ల తేమ అధికంగా ఉందని మిల్లర్లు వంకలు పెడుతుండగా, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిజానికి కోతలు ముగిసిన తర్వాత ఒకటి రెండు రోజులు ఆరబెడితే సరిపోతుందని, నిబంధనల ప్రకారం 18 శాతం తేమ ఉండే కొనుగోళ్లు చేయాలని అంటున్నారు. కానీ, ఎక్కువ రోజులు ఆరబెడితే తేమ మరింత తగ్గి తూకంరాక తాము నష్టపోయే ప్రమాదముంటుందని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెబుతున్నారు. కొనుగోళ్లలో జాప్యం జరిగితే అకాల వర్షాలతో ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని వాపోతున్నారు.

### ఇంకా కొంటలేరు




మాది కరీంనగర్‌లోని సీతారాంపూర్. ఇక్కడి మార్కెట్ల కేంద్రం ఓపెన్ చేసిన్రని వడ్లు తెచ్చిన. తీరా ఇక్కడికచ్చి చూస్తే ఇంకా కొంట లేరని తెలిసింది. నాకున్న 25 గంటల భూమిల ట్రాక్టర్ వడ్లు వచ్చినయి. నిన్నటి నుంచి ఆరబెడుతున్న. మంచిగ ఎండినయి. రేపటెల్లుండి కాంట పెట్టకుంటే తేమ తగ్గి తూకం వేస్తే ఎక్కువ వడ్లు పోవచ్చు. నాకు నష్టం రావచ్చు. ఇప్పటికైనా అధికారులు తొందరగా కొనుగోళ్లు జరిపితే నాకు ఎలాంటి నష్టం ఉండదు.

**- మిట్ట సంపత్, సీతారాంపూర్**



కరీంనగర్ మండలం దుర్శేడులో ధాన్యం కుప్పలు

### వానొస్తే వడ్లు తడుసుడే



మాది వల్లంపహాడ్. నాలుగు ట్రాక్టర్ల వడ్లు తెచ్చిన. సొసైటీ ఆధ్వర్యంల ఇక్కడ వడ్లు కొంటరు. ఇప్పటికే కేంద్రం ప్రారంభించేది ఉండే. ఇప్పటి వరకు ప్రారంభించలే. కనీసం టార్పాలిన్లు సుత ఇస్త లేరు. వానొస్తే మా సంగతి అంతే. నిన్నటి నుంచి ఆరబెడుతున్నం. వానొస్తేట్టున్నది. వెంటనే కొంటే ఫర్వాలేదు. నాలుగైదు రోజులు ఆగితే మాత్రం మా పని ఖతమే. వర్షానికి తడిస్తే ఇంకో రెండు రోజులైతది. ఇప్పటికే కొంటే బాగుండు. పొద్దుగాల ఆరబెడుతున్నం. సాయంత్రం కుప్ప జేస్తున్నం. కాని వర్షం వస్తదని భయమే ఉంది.

**- ఒజ్జాల దేవేందర్, వల్లంపహాడ్**


రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు

## పల్లె పల్లె నుంచీ కదులుదాం

- జగిత్యాల నియోజకవర్గ సత్తా చాటుదాం
- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

రాయికల్, ఏప్రిల్ 18: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పల్లె పల్లె నుంచీ కదులుదామని, జగిత్యాల నియోజకవర్గ సత్తా చాటుదామని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పిలుపునిచ్చారు. రాయికల్ పట్టణంలో పట్టణ, మండల ముఖ్య నాయకులతో శుక్రవారం ఆమె సమావేశమై, మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. 27న గ్రామగ్రామాన పార్టీ జెండా ఎగురవేసి, సభకు బయలుదేరాలన్నారు. అనంతరం పలు వార్డుల్లో ర్యాలీగా బయలుదేరి చలో వరంగల్ సభ వాల్‌పోస్టర్‌ను అంటించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు అనిల్, మండలాధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, కోఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు రాణిసాయి, ఉదయశ్రీ, మండల ప్రధాన కార్యదర్శి రత్నాకర్‌రావు, మండల మహిళా అధ్యక్షురాలు స్పందన, మాజీ కౌన్సిలర్లు సత్యనారాయణ, రాజేశ్‌గౌడ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా ఉంటాం

- తాగు, సాగునీటి కోసం పోరాడుతాం
- 'చలో నారాయణపూర్ రిజర్వాయర్' పాదయాత్ర చేస్తాం
- ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్


కరీంనగర్ రూరల్: చెర్లభూత్కూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 18 : బీఆర్ఎస్ అధ్వర్యంలో కరీంనగర్ నియోజక వర్గంలోని ప్రతి కల్లం తిరిగి రైతులకు అండగా ఉంటామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ భరోసా ఇచ్చారు. తాగు, సాగునీటికోసం పోరాడుతామని, 'చలో నారాయణపూర్ రిజర్వాయర్' పేరుతో పాదయాత్ర చేస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని దుర్శేడ్, మొగ్దుంపూర్, చెర్లభూత్కూర్, జూబ్లినగర్, నగునూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా మొద్దు నిద్ర వీడి రైతులను పట్టించుకోవాలని సూచించారు. ధాన్యాన్ని కేంద్రాలకు దగ్గరగా ఉన్న మిల్లులకు కేటాయించకుండా దూర ప్రాంతాలకు కేటాయించడం వల్ల రవాణా భారం పెరుగుతుందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆయన స్పందించి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను వివరించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కేంద్రాల్లో గన్నీ బ్యాగులు ఉన్నాయా? లేవా? అని తెలుసుకున్నారు. తేమ 12 శాతం వచ్చిన వెంటనే కొనకుంటే నూకగా మారే పరిస్థితి ఉందన్నారు. వడగండ్ల వానలు వచ్చే ప్రమాదం ఉన్నందున ధాన్యం వెనువెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ సమయంలోగా 95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నామని, ఇప్పుడు 30 లక్షల టన్నులకు పడిపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి కారణమని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో కరీంగనర్ ప్యాక్స్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, దుర్శేడ్ ప్యాక్స్ చైర్మన్ తోట తిరుపతి, వైస్ చైర్మన్ గోనె నర్సయ్య, మాజీ సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, జక్కం నర్సయ్య, ఉప్పుల శ్రీధర్, మాజీ ఎంపీటీసీ బుర్ర తిరుపతి, చల్ల లింగారెడ్డి, నెక్ పాషా, వరి భద్రయ్య, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.


కుస్తాపూర్‌లో మహిళా సంఘాల సభ్యులకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

## రజతోత్సవ సభకు రండి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- కుస్తాపూర్‌లో గ్రామాభివృద్ధి కమిటీ, మహిళా సంఘాల సభ్యులకు ఆహ్వానం

మల్లాపూర్, ఏప్రిల్ 18: ఎల్కతుర్తిలో ఈ నెల 27న తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గ్రామాల నుంచి పెద్దఎత్తున తరలిరావాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పిలుపునిచ్చారు. శుక్రవారం మల్లాపూర్ మండలం కుస్తాపూర్ గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు అందించాలని గుర్తు చేశారు. ప్రజలు స్వచ్ఛందంగా సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఇక్కడ పార్టీ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గంగారెడ్డి, నాయకులు కాటిపెల్లి ఆదిరెడ్డి, దేవ మల్లయ్య తదితరులు ఉన్నారు.

# అకాల వర్షం.. అపార నష్టం

### ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వడగండ్ల వాన


ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండిలోని ఒడ్డెర కాలనీలో ఎగిరిపోయిన గుడిసె పైకప్పు

- జగిత్యాల, సిరిసిల్లలో తీవ్ర ప్రభావం
- నేలరాలిన వడ్లు, మామిడికాయలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం, పసుపు
- అన్నదాతల ఆందోళన

మెట్‌పల్లి/ గంభీరావుపేట/ ముస్తాబాద్, ఏప్రిల్ 18: ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం వడగండ్లతో కూడిన భారీ వాన పడింది. జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలో ప్రభావం చూపింది. ప్రధానంగా కోరుట్ల నియోజకవర్గం అతలాకుతలమైంది. సుమారు గంటపాటు ఈదురుగాలులుతో కూడిన పడిన వానకు మెట్‌పల్లి పట్టణంతో పాటు ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కోరుట్ల, మెట్‌పల్లి మండలాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. మెట్‌పల్లి బస్టాండ్ చౌరస్తాలో ట్రాఫిక్ స్టాండ్ ప్రధాన రహదారిపై పడింది. పలు చోట్ల రోడ్లపై చెట్లు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయ కలిగింది. గాలివానతో దాదాపుగా మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మెట్‌పల్లి మండలంలో భారీ చెట్లతోపాటు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. వరి, నువ్వులు, సజ్జ పంటలు నేలవాలగా, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, పసుపు తడిసిపోయింది. వేంపేట, ఆత్మకూర్‌లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మెట్‌పల్లి పాత మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో భారీ వృక్షం విరిగిపడింది. కోరుట్లలో బలమైన ఈదురు గాలులతో పట్టణ శివారులోని మామిడి కాయలు నేలరాలాయి. కథలాపూర్ మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడిసిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరుతున్నారు. నష్టపోయిన పంటలకు పరిహారం ఇప్పించాలని వేడుకుంటున్నారు. ఇటు రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో సుమారు 250ఎకరాలల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. రాజుపేటలోని కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన వరి ధాన్యం తడిసిముద్దయింది. నర్మాలలో రోడ్డుకు ఇరువైపులా చెట్లు విరిగి పడడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ముస్తాబాద్ మండలం మోహినికుంట, మద్దికుంటలో వరి పంట, మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.


మెట్‌పల్లి రూరల్: కోనరావుపేట కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యం కుప్పలు


ముస్తాబాద్: మద్దికుంటలో నేలరాలిన మామిడికాయలు

### కథలాపూర్ పీహెచ్‌సీలో వ్యాక్సినేషన్ గది దగ్ధం

కథలాపూర్, ఏప్రిల్ 18: కథలాపూర్ పీహెచ్‌సీలో వ్యాక్సినేషన్ గది శుక్రవారం సాయంత్రం దగ్ధమైంది. అకాల వర్షంతో వీచిన బలమైన గాలులతో షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగినట్లు వైద్యాధికారులు తెలిపారు. దీంతో వ్యాక్సిన్ నిల్వలు ఉంచే గదిలోని నాలుగు ఫ్రిడ్జ్‌లు, రెండు ఇన్వేటర్లు కాలిపోయినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు ₹25లక్షల నష్టం జరిగినట్లు వైద్యాధికారి సింధూజ పేర్కొన్నారు. పీహెచ్‌సీలో ప్రమాదం జరిగిన తీరును పోలీసులు పరిశీలించారు.


మెట్‌పల్లి రూరల్: కోనరావుపేటలో నేలవాలిన నువ్వు పంట


మెట్‌పల్లి: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన పసుపు